



www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

ఆదివారం । 21 । జూన్ । 2026 । పేజీలు: 08






# కోకొల్లలుగా అక్రమ భవంతులు?

## అక్రమ నిర్మాణాలకు అడ్డేది?



**కొండాపూర్ డివిజన్ రాఘవేంద్ర కాలనీ, రాజరాజేశ్వరీ కాలనీలో కోకొల్లలుగా అక్రమ నిర్మాణాలు**

**ఫిర్యాదులు బుట్ట దాఖలేనా?**

**శేరిలింగంపల్లి, అక్షిత ప్రతినిధి :** అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. కళ్ళెం వేయాల్సిన అధికారులు కాసులకు కక్కుర్తి పడి దండుకుంటుంద్రు. కొండాపూర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ, రాజరాజేశ్వరీ కాలనీలో జోరుగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై పిర్యాదులు అందితే వెంటనే చర్యలు ఉంటాయని, బిల్డరులు పరిమితులు దాటకుండా పారదర్శకంగా నిర్మాణాలు చేపట్టాలని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన ఆదేశాలు బేఖాతరు చేస్తూ బిల్డింగుల నిర్మాణాలు యదేచ్ఛగా కొనసాగుతున్న పట్టించుకోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సిబ్బంది. ఫిర్యాదులు చేస్తే తక్షణమే చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి ఉన్నత అధికారుల మాటలు నీటి మూటలేనా అని స్థానిక ప్రజలు వాపోతున్నారు. హైటెక్ సిటీకి అత్యంత సమీపంలో ఉన్న ..మిగతా 2లో

# పకడ్బందీగా నీట్ పరీక్ష

**సకలం సన్నద్ధం: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**పరీక్షా కేంద్రం గేట్‌లు మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత మూసివేత**

**నీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం**

**అభ్యర్థులు జూన్ 21న పరీక్షకు జారీ చేసిన అడ్మిట్ కార్డ్ తీసుకురావాలి**

**సెల్ ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ తీసుకురావటానికి అనుమతి లేదు**

2






# ఆహ్లాదం... ఆనందకేళి!

**కింది బజార్ చెరువుకు కొత్త హంగులు**

**రూ.500 కోట్లతో సుందరీకరణ**

**పనుల పురోగతిని పరిశీలించిన జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి, హెచ్ఎండీఏ, ఆర్థిక, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు**

సంగారెడ్డి, అక్షిత బ్యూరో: సంగారెడ్డి పట్టణంలోని కింది బజార్ చెరువును రూ.500 కోట్ల వ్యయంతో సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన ప్రణాళికలకు మరింత వేగం చేకూరు తోంది. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి సంబంధిత శాఖల అధికారులతో కలిసి ..మిగతా 2లో

# అత్యున్నత వైద్య సేవలు

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** జిల్లాలోని పేద ప్రజలందరికి మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. శనివారం ఆయన నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఆన్‌లైన్ విధానంలో జరుగుతున్న ఓపీ సేవల నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ ..మిగతా 2లో

# పకడ్బందీగా నీట్ పరీక్ష

**సకలం సన్నద్ధం**

**జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**పరీక్షా కేంద్రం గేట్ లు మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత మూసివేత**

**నీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఆర్ టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం**

**అభ్యర్థులు జూన్ 21 న పరీక్షకు జారీ చేసిన అడ్మిట్ కార్డ్ తీసుకురావాలి**

**సెల్ ఫోన్ లు,ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ తీసుకురావటానికి అనుమతి లేదు**



**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్ :** నీట్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. జూన్ 21 న నీట్ పరీక్ష నిర్వహణ నేపథ్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, జిల్లా ఎస్పి డి.జానకి తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

జిల్లా కలెక్టర్ పరీక్షల నిర్వహణలో భాగంగా సంబంధిత శాఖల అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రవాణా శాఖ అధికారులు విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా తగిన రవాణా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో 13 పరీక్షా కేంద్రాల్లో

మొత్తం 4291 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా, విద్యార్థులందరికీ రవాణా శాఖ తరపున ఉచిత ప్రయాణ సౌకర్యంలి కల్పించబడినట్లు తెలిపారు. విద్యాశాఖ, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి పరీక్షల సజావు నిర్వహణకు సహకరించాలని సూచించారు.

అలాగే పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా, ఎటువంటి అంతరాయాలు కలగకుండా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు నిర్ణీత సమయానికి ముందుగానే చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ హాల్ టికెట్/అడ్మిట్ కార్డ్‌లో పొందుపరిచిన అన్ని సూచనలు తప్పనిసరిగా చదివి, అందులో పేర్కొన్న నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని తెలిపారు.పరీక్ష మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:15 గంటల వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. పరీక్ష రోజున ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అభ్యర్థులు ఒక రోజు ముందుగానే తమ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి లొకేషన్ తెలుసుకోవాలని సూచించారు.

పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో ఉన్న జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు, బుక్ స్టాళ్లు/బుక్ సెంటర్లు పరీక్ష సమయాల్లో మూసివేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

విద్యార్థులు తప్పనిసరిగా: అడ్మిట్ కార్డు / హాల్ టికెట్ చెల్లుబాటు అయ్యే ఒరిజినల్ ఫోటో ఐడీ ప్రూఫ్ వెంట తీసుకురావాలని తెలిపారు. వీటి పరిశీలన లేకుండా ఏ అభ్యర్థినీ పరీక్షా కేంద్రంలోకి అనుమతించరని స్పష్టం చేశారు. ఎన్ టిఏ వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్ కార్డులో కేటాయించిన స్థలంలో పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను అతికించి తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి కనీసం 2 గంటల ముందుగానే చేరుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే ప్రవేశం ఉంటుందని, 1:30 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరినీ అనుమతించరని స్పష్టం చేశారు. అభ్యర్థులు సాధారణ దుస్తుల్లో రావాలని, ముఖ్యంగా మహిళా అభ్యర్థులు సహా ఎవ్వరూ ఆభరణాలు, మెటల్ వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు ధరించకూడదని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో మెటల్ డిటెక్టర్ ద్వారా తనిఖీలునిర్వహించబడతాయని చెప్పారు.

**పరీక్షా కేంద్రాలలో ప్రవేశ సమయంలో..**

బయోమెట్రిక్ హాజరు నమోదు ఫేస్ వెరిఫికేషన్ ఫ్రిస్కింగ్ / భద్రతా తనిఖీలు తప్పనిసరిగా నిర్వహించబడతాయని తెలిపారు.అభ్యర్థులు మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, పుస్తకాలు, నోట్స్, స్టడీ మెటీరియల్ వంటి నిషేధిత వస్తువులు తీసుకురాకూడదని తెలిపారు.విద్యాలయ ప్రిన్సిపల్, నోడల్ అధికారి సురేందర్ తదితరులు పాల్గొన్నారు

## కోకొల్లలుగా అక్రమ భవంతులు?

**మొదటి పేజీ తరువాయి...**

శ్రీ రాఘవేంద్ర కాలనీలో కాలనీ సి బ్లాక్ లో ప్లాట్ నెంబర్ 347, 450, రాజ రాజేశ్వరీ కాలనీ మెయిన్ రోడ్ లో ప్లాట్ నెంబర్ 99 రత్న దీప్ సూపర్ మార్కెట్ ఎదురుగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాలపై పిర్యాదులు చేసిన బుట్ట దాఖలు చేయడం గమనార్హం తక్షణమే చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాల జోరుతో బోర్ లో నీరు అడుగంటి ట్యాంకర్ లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉత్పన్నమయ్యింది అని, అలాగే పార్కింగ్ సౌకర్యం లేకుండా భవనాలు నిర్మిస్తున్న పట్టించుకోక పోవడంతో రోడ్ల మీద పార్కింగ్ లు, ట్రాఫిక్ సమస్యలు, పరిమితికి మించి నివాసం ఉంటున్న ప్రజల దైనందిన కార్యక్రమాలు అధికం అవడంతో డ్రైనేజీ పొంగి పొర్లి రోడ్లపై పారి దుర్గంధం వెదజలుతున్నాయి అని కాబట్టి ప్రజల ప్రయోజనం కోసం పరిమితికి మించి అదనపు అంతస్తుల నిర్మాణం చేసే వారి నిర్మాణాలపై జిహెచ్ఎంసి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేశారు.

## ఆహ్లాదం...ఆనందకేళి!

**మొదటి పేజీ తరువాయి...**

శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువు అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు, చేపట్టాల్సిన పనులపై విస్తృతంగా చర్చించారు. సుమారు కిలోమీటరున్నర పొడవున ఉన్న చెరువు కట్టను ఆధునిక హంగులతో అభివృద్ధి చేయడం, నెక్లెస్ రోడ్ నిర్మాణం, పార్కుల ఏర్పాటు, ప్రజలకు ఆహ్లాదకరమైన విహార కేంద్రంగా తీర్చిదిద్దే అంశాలపై అధికారులతో సమీక్షించారు. సంగారెడ్డి పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు హైదరాబాద్ నుంచి వచ్చే సందర్శకులను ఆకట్టుకునే విధంగా కింది బజార్ చెరువును అభివృద్ధి చేయాలని జగ్గారెడ్డి అధికారులకు సూచించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పట్టణానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగేలా అవసరమైన ప్రతిపాదనలు, పరిపాలనా ప్రక్రియలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రెండేళ్లలో పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సమీక్ష సమావేశం అనంతరం జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి సంబంధిత అధికారులతో కలిసి కింది బజార్ చెరువు కట్ట ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ముఖ్యంగా అలుగు సమీపంలోని ప్రభుత్వ భూములను సందర్శించి, వివిధ అభివృద్ధి పనులు చేపట్టాల్సిన ప్రాంతాలను గుర్తిస్తూ అధికారులతో చర్చించారు. ప్రాజెక్టు అమలులో నాణ్యతతో పాటు ప్రజలకు ఉపయోగపడే విధంగా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.


## అత్యున్నత వైద్య సేవలు

**మొదటి పేజీ తరువాయి...**



సగటున నమోదవుతున్న ఓపీ వివరాలతో పాటు, ఏ విభాగాలకు చెందిన చికిత్సల కోసం ఎక్కువ మంది రోగులు వస్తున్నారో ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని సందర్శించి, రోగులకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందించాలని, అవసరమైన వారికి తక్షణమే రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. రోగుల సౌకర్యార్థం వివిధ విభాగాలను సూచించే సైన్ బోర్డులను ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆసుపత్రికి సంబంధించిన రికార్డులను పరిశీలించిన కలెక్టర్, ప్రతి రికార్డును పకడ్బందీగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ విభాగాన్ని పరిశీలించిన ఆయన, ఇంకా పూర్తి కావాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శారద, వైద్య శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష



**వరంగల్, అక్షిత బ్యూరో:** ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపై జిల్లా కలెక్టర్ డా. సత్య శారద శనివారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇందిరమ్మ ప్రజాపాలన గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకున్న 4,309 గుడిసెల వివరాలను సోమవారం నాటికి క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిజంగా గుడిసెలు ఉన్న అర్హుల వివరాలను నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

సేకరించిన జాబితాను గ్రామైక్య సంఘాలకు అందజేసి, వారు పరిశీలించి తీర్మానం చేసిన అనంతరం ఎంపీడీవోలకు పంపించాలని సూచించారు. పారదర్శకంగా అర్హుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు.

అదేవిధంగా, తొలి దశలో మంజూరైన 5,373 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆగస్టు 15 నాటికి పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇందిరమ్మ ఇంటి వద్ద తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించుకోవడంతో పాటు, ఇంటింటికి ఆరు మొక్కలు నాటేలా అవగాహన కల్పించాలని సూచించారు.

ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, డీఆర్‌డీఓ నాగ పద్మజ, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## 26వ డివిజన్ ఆదర్శనగర్‌లో రూ.30.50 లక్షలతో సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ పనులకు శంకుస్థాపన



**కరీంనగర్ అక్షిత న్యూస్:** కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా 26వ డివిజన్ ఆదర్శనగర్‌లో మున్సిపల్ సాధారణ నిధుల నుండి రూ.30.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుధ్య సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయిన అనంతరం స్థానిక ప్రజలకు ఎంతో సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 26వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ కో-ఆప్షన్ సభ్యురాలు చిగురు వెంకటమ్మ , స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో

# రైతుల మహా ధర్నా

**కేంద్రంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే ప్రతి గింజనూ కొనుగోలు చేయాలి**

**వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరాను కొనసాగించాలి**

**రైతులకు శాపంగా మారిన 'యూరియా యాప్'ను రద్దు చేసి, నేరుగా ఎరువులు పంపిణీ చేయాలి**






**అక్షిత బ్యూరో జయశంకర్ భూపాలపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి రైతు ధర్నా నిర్వహించింది. ఈ నిరసన కార్యక్రమంలో భూపాలపల్లి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే గండ్ర, రాకేష్ రెడ్డి తీవ్ర విమర్శలు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని, సన్న, దొడ్డ వడ్లకు బోనస్ ఇస్తామని బోగస్ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వం.. ఇప్పుడు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ధ్వజమెత్తారు.

"కేంద్ర ప్రభుత్వం కొంటేనే రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొంటుందని కాలయాపన చేస్తూ, రైతుల బతుకులను మళ్లీ దళారుల చేతుల్లో పెట్టేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోంది. కేంద్రంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి ధాన్యాన్ని సేకరించాలి."

రైతులకు సకాలంలో యూరియా అందించకుండా రోడ్లపై పడిగాపులు కాసేలా చేశారని వారు ఆరోపించారు. రైతులకు మేలు చేస్తామంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన 'యూరియా యాప్' సాంకేతిక పరిజ్ఞానం లేని, చదువురాని సామాన్య రైతులకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే యాప్ నిబంధనను తొలగించి, నేరుగా రైతులకు యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

**విద్యుత్ సరఫరాపై ఆందోళన**

గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు అండగా నిలిచిన 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరాను ఈ ప్రభుత్వం అస్తవ్యస్తం చేసిందని మండిపడ్డారు. నేటి విద్యుత్ కోతలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటి కష్టాలను గుర్తుచేస్తున్నాయని, వ్యవసాయానికి పూర్తి స్థాయిలో విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వం దిగిరాకుంటే ఉద్యమం తప్పదు!**

రైతు సమస్యలపై ప్రభుత్వం ఒక ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, రేవంత్ రెడ్డి రైతుల పట్ల తన వైఖరిని మార్చుకోవాలని బిఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. రైతుల డిమాండ్లను వెంటనే నెరవేర్చకపోతే, రాబోయే రోజుల్లో ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపట్టి బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి బిఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. సత్య శారదలి.




**వరంగల్, అక్షిత బ్యూరో:** పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు వరంగల్ దేశాయిపేట లోని సి, కే,ఎం ప్రభుత్వ కళాశాలలో నీట్ పరీక్షల సందర్భంగా కల్పిస్తున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, పరీక్ష నిర్వహణను పరిశీలించి పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర నిర్వాహకులకు, అధికారులను ఆదేశించారు.

## ఖాదర్ బాబా విజ్ఞప్తికి స్పందన.. మొహరం ఏర్పాట్లు వేగవంతం



**మహబూబాబాద్, అక్షిత బ్యూరో:** మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలు గ్రామంలో మొహరం పండుగ ఏర్పాట్ల కోసం ఖాదర్ బాబా చేసిన విజ్ఞప్తికి స్పందించిన మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. పీరీల కొట్టం ప్రాంతంలో ఏర్పాట్లను పరిశీలించి జేసీబీ, మున్సిపల్ సిబ్బందితో పనులు వేగవంతం చేశారు. పారిశుధ్యం, తాగునీటి సౌకర్యాల కల్పనతో పాటు పగిలిన నీటి పైపుల మరమ్మతులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేయగా, మున్సిపల్ కమిషనర్‌తో పాటు 6వ వార్డు కౌన్సిలర్ బుజ్జి రాంజీ నాయక్‌కు ముస్లిం సోదరులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి ఆలయాన్ని ప్రసాద్ పథకంలో చేర్చాలని విజ్ఞప్తి



**కొమురవెల్లి అక్షిత న్యూస్:** కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి దర్శనార్థం విచ్చేసిన బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్ ని కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మహాదేవుని శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ శైవక్షేత్రంగా పేరుగాంచిన కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి ఆలయాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రసాద్ పిల్‌గ్రిమేజ్ రెజువేనేషన్ అండ్ స్పిరిట్యుయల్ హెరిటేజ్ ఆగ్మెంటేషన్ డ్రైవ్ ప్రసాద్ పథకంలో చేర్చాలని కోరారు.ప్రసాద్ పథకం ద్వారా ఆలయ పరిసర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు,పర్యాటక రంగ ప్రోత్సాహం,ఆధ్యాత్మిక వారసత్వ పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు.అదేవిధంగా, కొమురవెల్లి దేవస్థానం మరింత అభివృద్ధి చెందేందుకు,దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డాక్టర్ కె. లక్ష్మణ్ ని మహాదేవుని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు బొచ్చుఎల్లయ్య యాదవ్,మల్లంబాలయ్య, జనగాంశ్రీకాంత్,చింతల పరుశరాములు,ఎరుపుల రాజు,ఉప్పలవంశీకృష్ణ, గుండమహేష్,గొల్లపల్లి శ్రీనివాస్,గోదల నవీన్,శీను మరియు చింతల రమేష్ పాల్గొన్నారు.

# వన మహోత్సవం విస్తృతంగా ప్రచారం చేయాలి

**అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**





**వనపర్తి అక్షిత ప్రతినిధి :** రాష్ట్రంలో పచ్చదనం పెంచేందుకు ప్రభుత్వం ప్రారంభించిన "వన మహోత్సవం" కార్యక్రమ లక్ష్యాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ సూచించారు. శనివారం కొత్తకోట మండలం కానాయపల్లి, అమడబాకుల గ్రామపంచాయతీలలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పాఠశాలలు నర్సరీలను సందర్శించిన అదనపు కలెక్టర్, పాఠశాలల్లో రికార్డులు, హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి వారి విద్యాభ్యాసం, పాఠశాల పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. పాఠశాలల నిర్వహణ తీరును సమీక్షించి విద్యార్థుల హాజరు శాతాన్ని మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అదనంగా నర్సరీలో పెంచుతున్న మొక్కల సంరక్షణ, నిర్వహణపై వివరాలు తెలుసుకుని, మొక్కలను నాణ్యతతో పెంచాలని సూచించారు. వన మహోత్సవం లక్ష్యాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ ఉమాదేవి, ఎంపీడీఓ వినీత్, ఎపివో రాములు, పంచాయతీ కార్యదర్శులు రాజు, సర్పంచ్ బొంతం శిరీష సాయి, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సతీష్ యాదవ్‌కు గొప్ప పురస్కారం




**వనపర్తి అక్షిత ప్రతినిధి :** వనపర్తి జిల్లా అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు మాజీ కౌన్సిలర్ డా. సతీష్ యాదవ్ మరో గొప్ప పురస్కారం అందుకున్నారు. తమిళనాడు రాష్ట్రం ఊటీ లో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం లైఫ్ టైమ్ అచ్యుమెంట్ అవార్డ్ ను ఆయన పొందారు. జిల్లాలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహిస్తున్నందుకు గుర్తింపుగా డా. ఏపీజే అబ్దుల్ కలాం లైఫ్ టైమ్ అచ్యుమెంట్ అవార్డ్ ను ఇంటర్ నేషనల్ పీస్ కౌన్సిల్ ఆర్గనేషన్ వారు అందజేశారు. పలు విభాగాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులను సన్మానించి వారిని ప్రోత్సహిస్తున్నందుకు అలాగే తల్లిదండ్రులు లేని పేద విద్యార్థులకు సహాయం చేయడం గుర్తించిన కొందరి రిఫరెన్స్ తో ఈ అవార్డు అందుకున్నారు. ఇప్పటికే సమాజ సేవలను గుర్తించి డాక్టరేట్ కూడా పొందిన సతీష్ యాదవ్ కు ఈ అవార్డు వచ్చిన సందర్భంగా వనపర్తి ప్రజలకు, మిత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చీఫ్ జడ్జ్ డాక్టర్ ప్రభు రంగరాజన్, డాక్టర్ జార్జ్ పీటర్, అధ్యక్షుడు డాక్టర్ కిమ్, యూఎన్ఐపిసి సంస్థ కోఆర్డినేటర్స్ ఉమ్మడి పాలమూరు జిల్లా మాజీ రిజిస్టర్ డా. మల్లారెడ్డి , ఉబ్బలి విశ్వనాథం హాజరైనట్లు తెలిపారు.

# మానవతా సేవలో పోలీసు శాఖ..

## "మా" అభాగ్యుల వృద్ధాశ్రమాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ

### వృద్ధులకు పండ్లు, నిత్యావసర సరుకులు పంపిణీ

**గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని "మా" అభాగ్యుల వృద్ధాశ్రమాన్ని శనివారం రోజున జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే సందర్శించారు**






**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులు,అవసరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు,బియ్యం,కిరాణా సరుకులు మరియు ఇతర నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు.

సమాజంలో వృద్ధులు, నిరాశ్రయులు,అనాథల సంక్షేమం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.వృద్ధుల సేవ చేయడం గొప్ప మానవతా ధర్మమని, వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు.అవసరమైన వారికి సేవలు అందించడంలో జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.

ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ వెంకటేష్, ఎస్.ఐ శ్రీకాంత్ వృద్ధాశ్రమ సభ్యులు ఉన్నారు.



## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### మహిళా ప్రతినిధులను సన్మానించిన ఎంపీడీవో కూచన ప్రకాశ్



**రాయపర్తి అక్షిత ప్రతినిధి:** పర్యావరణ పరిరక్షణలో ప్రజాప్రతినిధులు ముందుండి సమాజానికి ఆదర్శంగా నిలవాలని రాయపర్తి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కూచన ప్రకాశ్ అన్నారు. రాయపర్తి మండల కేంద్రంలో నిర్వహించిన 2వ, 3వ బ్యాచ్ వార్డు సభ్యుల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి మద్దతుగా పలువురు మహిళా వార్డు సభ్యులు తమ ఇళ్ల నుంచి స్టీల్ ప్లేట్లను తెచ్చుకుని మధ్యాహ్న భోజనం చేయడం విశేషంగా నిలిచింది. పర్యావరణ పరిరక్షణపై వారు చూపిన చొరవను అభినందించిన ఎంపీడీవో కూచన ప్రకాశ్, మహిళా ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరించి చిరు కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో మార్పు ప్రతి వ్యక్తి నుంచే ప్రారంభం కావాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రజాప్రతినిధులు ముందుండాలని సూచించారు. మహిళా వార్డు సభ్యులు ఇంటి నుంచి ప్లేట్లు తెచ్చుకుని భోజనం చేయడం అభినందనీయమని, వారి చర్య గ్రామ ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజల అలవాట్లలో సానుకూల మార్పులు తీసుకురావడంలో వార్డు సభ్యులు, ఉప సర్పంచులు కీలక పాత్ర పోషించాలని ఆయన అన్నారు. శిక్షణా కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల వార్డు సభ్యులు, ఉప సర్పంచులు, శిక్షకులు విజేందర్, నర్సయ్య, పద్మనాభ స్వామి, మండల పరిషత్ సిబ్బంది వరుణ్, పాషా, ఈ-పంచాయతీ ఆపరేటర్లు సంతోష్, సతీష్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు ప్రజాప్రతినిధుల్లో సామాజిక బాధ్యతను మరింత పెంపొందించేలా సాగింది.

## తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరించిన పార్టీ అధ్యక్షురాలు




**వరంగల్, అక్షిత బ్యూరో:** తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో జెండా పండుగను వరంగల్‌లో ఘనంగా నిర్వహించారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొని పార్టీ జెండాను ఎగురవేశారు.

అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన జెండా గద్దెను ఆవిష్కరించి పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని జెండా పండుగను విజయవంతం చేశారు. పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైంది

### రంగారెడ్డి జిల్లా టిఆర్ఎస్ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**రంగా రెడ్డి అక్షిత బ్యూరో:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజల దృష్టి మళ్లించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, విద్యుత్, సంక్షేమం, పారిశ్రామిక రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. పదేళ్ల పాటు తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం ద్వారా కాంగ్రెస్ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని అన్నారు.

రైతు సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని, రైతుబంధు పథకం ద్వారా 72 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందించామని, రైతు బీమా పథకం ద్వారా వేలాది రైతు కుటుంబాలకు భరోసా కల్పించామని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ హయంలో దేశంలోనే అత్యధికంగా రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా అమలులో స్పష్టత లేకుండా వ్యవహరిస్తూ రైతులను అయోమయానికి గురిచేస్తోందని విమర్శించారు. రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని పూర్తిగా అమలు చేయకుండా అనేక నిబంధనలు పెట్టి రైతులను మోసం చేసిందన్నారు. ఎన్నికల ముందు చెప్పిన మాటలకు, అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తున్న పనులకు పొంతన లేకుండా పోయిందని అన్నారు. అలాగే ఇప్పటికే 4సార్లు నియోజకవర్గానికి విచ్చేసిన ముఖ్యమంత్రి ఎన్ని నిధులు కేటాయించారో చెప్పాలి, స్థానిక ఎమ్మెల్యే ఎన్ని నిధులు అడిగారో కూడా నిరూపించాలి.నియోజకవర్గంలోనే పెద్ద గ్రామమైన ఆరుట్లకు నిధులు కేటాయించాలని సర్పంచ్ వినతిపత్రమివ్వగా దానికి పక్కన పెట్టడం సరి కాదని, పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధి పనిచేయాలని, మంత్రి పదవి ఆశతో గ్రామాల అభివృద్ధి పక్కన పెట్టడం సరికాదన్నారు.

## రాష్ట్ర పౌర సరఫరాల అధికారుల బృందం ఆకస్మిక తనిఖీలు

### పాఠశాలలు, కళాశాలలు,రేషన్ దుకాణాలు తనిఖీలు



**మహబూబ్ నగర్,( అక్షిత న్యూస్):** రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్, హైదరాబాద్ ఆదేశాల మేరకు రాష్ట్ర పౌర సరవరాల సంస్థ కార్యాలయం లో పని చేస్తున్న ఈ. భాస్కర్ రావు, జనరల్ మేనేజర్ (అడ్మినిస్ట్రేషన్), రహ్మాన్, టెక్నికల్ అసిస్టెంట్, సంతోష్, ఈటీఎఫ్ లతో కూడిన అధికారుల బృందం, జిల్లా మేనేజర్ పౌర సరఫరాల సంస్థ అధికారి ఎ. రవి నాయక్, డిప్యూటీ తహసీల్దార్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రాజీవ్ రెడ్డి, దేవరకద్ర ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్ ఓ డిప్యూటీ తహసీల్దార్ ఇమ్తియాజుద్దీన్‌లతో కలిసి శనివారం మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బీసీ బాలికల కళాశాల వసతి గృహం, రేషన్ షాప్ నెం.13తో పాటు దేవరకద్ర మండలంలోని కేజీబీవీ పాఠశాల, అమ్మాపూర్, రేషన్ షాప్ నెం.9లను ఆకస్మికంగా తనిఖీ లు నిర్వహించారు.

ఈ సందర్భంగా సరఫరా అవుతున్న బియ్యం నాణ్యతను పరిశీలించేందుకు బియ్యం నమూనాలను సేకరించారు. తనిఖీ బృందం విద్యార్థులు మరియు లబ్ధిదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకుంది. విద్యార్థులు ప్రభుత్వం సరఫరా చేస్తున్న స్టీమ్ రైస్ నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. స్టీమ్ రైస్ వండటానికి అనుకూలంగా ఉండటంతో పాటు రుచికరంగా ఉండి ఎలాంటి వృథా లేకుండా వినియోగిస్తున్నామని తెలిపారు. అందువల్ల ముడి బియ్యం (రా రైస్)కు బదులుగా ప్రస్తుతం సరఫరా చేస్తున్న స్టీమ్ రైస్‌ను కొనసాగించాలని వారు కోరారు. రాష్ట్రంలోని పాఠశాలలు, వసతి గృహాలకు నాణ్యమైన స్టీమ్ రైస్‌ను సరఫరా చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విద్యార్థులు మరియు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. సరఫరా అవుతున్న బియ్యం నాణ్యతపై లబ్ధిదారుల నుంచి సానుకూల స్పందన లభించినట్లు తనిఖీ బృందం పేర్కొంది.

# ప్రైవేటు బడి ఫీజు దోపిడీని అరికట్టాలి

**ఎంఈఓకు వినతి పత్రం ఇచ్చిన**

**బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు దారమోని గణేష్**

**ఫీజ్ నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి**



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** విద్య హక్కు చట్టాన్ని తుంగాలో తొక్కుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి.

పుస్తకాలు, దుస్తులు పేరిట ప్రైవేటు పాఠశాలల దందాను అరికట్టాలి.రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాల పాఠశాలలు కాలం తీరిన బస్సులని బస్సులో నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం.విద్యను వ్యాపారం చేస్తున్న పాఠశాలల పైన కఠిన చర్యలు తీసుకోని ఎడల కల్వకుర్తి గడ్డ నుండి ముఖ్యమంత్రి కార్యాలయం వరకు ఫీజు పోరు యాత్ర చేపడతామని దారమోని గణేష్ తెలిపారు.కల్వకుర్తి నియోజకవర్గం,కల్వకుర్తి పట్టణంలో బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు దారమోని గణేష్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓ (విద్యాశాఖ అధికారి) శంకర్ నాయక్ కి కలిసి వినతి పత్రాన్ని సమర్పించి అనంతరం ఫీజు పోరు యాత్రకు పిలుపునివ్వడం జరిగింది.రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలలు విద్యాసంవత్సరం ప్రారంభంలోనే విద్యని వ్యాపారంగా చేసుకుని విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అడ్డగోలుగా ఫీజులను వసూలు చేస్తూ పాఠశాలలోనే పుస్తకాలను, దుస్తులను అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నాయని వీటి పైన రాష్ట్రంలో నియంత్రణ కరువైందని, వీటిపైన వెంటనే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి రేవంత్ రెడ్డి చర్యలు చేపట్టాలని గణేష్ డిమాండ్ చేశారు.పాఠశాల యాజమాన్యాలు కాలం తిరిగిన బస్సులను, సరైన ఫిట్నెస్ లేకున్నా విద్యార్థులను తరలిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్న రవాణా అధికారులు, ప్రతి ఒక్క బస్సులో దాని యొక్క ప్రమాణాలకు మించి విద్యార్థులను తరలిస్తూ కనీస సేఫ్టీని కూడా పాటించని బస్సులు ఇలా ఒకటి రెండు కాదు పదుల సంఖ్యలో బస్సులో ఉన్న వాటిపై చర్యలు తీసుకునే నాదురే లేరు, ఇలా ప్రతిదీ అధికారులు పట్టి పట్టనట్లు వ్యవహరిస్తే అవినీతి నిరోధక శాఖ వీటిపై నిగా పెంచాలని ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వంలో రేవంత్ సర్కార్లో కనీసం విద్యాశాఖ మంత్రిని నియమించలేకపోవడం సిగ్గుచేటని గురుకుల పాఠశాలలను నీరుకార్చారని ఇప్పుడు కొత్తగా 24,000 వేలకు పైగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలను కుదించి ప్రభుత్వ పాఠశాలలనే లేకుండా చేస్తామనడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత పాలనకు నిదర్శనమని, వెంటనే ముఖ్యమంత్రి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని గణేష్ అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మీరు ఇస్తామన్న మెగా డీఎస్సీ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని లేనియెడల ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు దారమోని గణేష్ చెప్పారు.ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే కల్వకుర్తిలో నియోజకవర్గం లో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ప్రైవేటు పాఠశాలలో అడ్డగోలుగా కార్పొరేట్ విద్యా పేరుతో,పాఠశాల గోడలకు రంగులు వేసి సరైన విద్యాహరత లేని ఉపాధ్యాయులు నియమించి తూతూ మంత్రంగా విద్యా బోధన సాగుతున్న విద్యాశాఖ అధికారులు కనీసం పాఠశాలలు తనిఖీ చేసే సోయిలో లేరని, విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ఫీజులను వసూలు చేస్తున్న విద్యాశాఖ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని చూసి చూడనట్టు ప్రైవేటు పాఠశాలకు అండగా నిలుస్తున్న అధికారుల పైన వెంటనే చర్యలు తీసుకోవాలని.లంచాల మత్తులో క్షేత్రస్థాయి పరిశీలనను కూడా మరచిపోయి విద్యాశాఖ కళ్ళు మూసుకుపోయిందని రేవంత్ రెడ్డి సర్కారులో ఫీజు నియంత్రణ కమిటీ కనుమరుగైందని ఇకనైనా పాఠశాలల్లో తనిఖీలు చేసి పాఠశాలన్ని వ్యాపారంగా చేసుకొని సొమ్ము చేసుకుంటున్నటువంటి పాఠశాలల గుర్తింపును రద్దు చేసి యాజమాన్యం పైన చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్వి తరఫున డిమాండ్ చేస్తున్నామని గణేష్ తెలిపారు. లేనియెడల స్వయంగా ప్రతి పాఠశాలలను బిఆర్ఎస్వి తరుపున ఫీజు పోరు యాత్ర చేపడతామని దారమోని గణేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి నాయకులు ఐలా శేఖర్ గౌడ్,వట్టెపు శ్రీనివాసులు, పెరుమాళ్ళ కృష్ణ,యాకూబ్,రమేష్ నాయక్, నరేష్,శివ తదితరులు పాల్గొన్నారు.

# యూరప్‌లో డ్యుయల్ మాస్టర్ డిగ్రీ పూర్తి చేసిన తూడి నవనీత్ రెడ్డి

**ఫ్రాన్స్‌లో జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేఘారెడ్డి దంపతులు**




**వనపర్తి అక్షిత ప్రతినిధి :** వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తనయుడు నవనీత్ రెడ్డి యూరప్ లోని అత్యంత ప్రతిష్టాత్మక ఉన్నత విద్యా సంస్థలో ఏకకాలంలో డ్యూయల్ మాస్టర్ డిగ్రి పూర్తి చేశారు. ఈఎస్సిపి బిసినెస్ స్కూల్ లో విధ్యనభ్యసించిన ఆయన మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పట్టాను ఫ్రాన్స్ లో మాస్టర్ ఆఫ్ సైన్ పట్టాను జర్మనీలో పూర్తి చేశారు. రెండు దేశాల్లోని విద్యా ప్రమాణాలను సమర్థవంతంగా అధిగమిస్తూ ఆయన ఈ ఘనత సాధించారు. ఈనెల 19న ఫ్రాన్స్ లో జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో నవనీత్ రెడ్డి తల్లిదండ్రులు వనపర్తి ఎమ్మెల్యే మేఘా–శారద దంపతులు, సోదరుడు మనోజ్ రెడ్డి పాల్గొన్నారు. 1819లో స్థాపించబడిన ఈఎస్సిపి బిసినెస్ స్కూల్ ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ బిజినెస్ స్కూళ్లలో ఒకటిగా గుర్తింపు ఉంది. ఇట్లాంటి ప్రతిష్టాత్మక సంస్థలో డ్యూయల్ మాస్టర్ డిగ్రి పూర్తి చేయడం ద్వారా నవనీత్ రెడ్డి అంతర్జాతీయ స్థాయిలో తన విద్యా ప్రతిభను చాటుకున్నారు. ప్రపంచ స్థాయి విద్యా అవకాశాలను అందిపుచ్చుకోవాలనే ఆకాంక్ష కలిగిన విద్యార్థులకు నవనీత్ రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నరు. ఈ సందర్భంగా ఆయనకు కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# సంకల్ప సిద్ధి సాయి బాబా ఆలయ కమిటీ అధ్యక్షులుగా కృష్ణారెడ్డి



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణ కేంద్రంలో అతి సుందరంగా వెలసిన శ్రీ సంకల్ప సిద్ధి సాయి బాబా ఆలయ కమిటీ చైర్మన్ గా పాపయ్య గారి కృష్ణారెడ్డిని అయన నిర్వాహకులు, సభ్యులు శనివారం ఆలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి గా సాక చెన్నయ్య, కోశాధికారిగా నాగరాల శ్రీనివాసరెడ్డిలు ఎంపికయ్యారు. పూర్తి కమిటీని వచ్చే గురువారం ప్రకటించనున్నామని ఆలయ నిర్వాహకులు బక్షి శ్రీధర్ రావు తెలిపారు. ఎన్నికైన అధ్యక్షులు కృష్ణారెడ్డిని, కమిటీ సభ్యులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆలయ అధ్యక్షులుగా నియమించడం అంటే దైవ కార్యాన్ని అప్పగించడమే అని సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఆలయ అభివృద్ధికి నా వంతు సాయం ఎప్పుడు ఉంటుందని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నాకు అవకాశం కల్పించిన ఆలయ నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# స్నేహితుడు లేడు... అతని కుటుంబానికి మేమున్నాం

**శ్రవణ్ కుటుంబానికి అండగా నిలిచిన పూర్వ విద్యార్థులు**



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** రామన్నపేట మండలం సిరిపురం గ్రామం లో ఇటీవల మరణించిన దాసిరెడ్డి శ్రవణ్ కుమార్ రెడ్డి మాజీ ఉప సర్పంచ్ కుటుంబ సభ్యులను 2001–2002 పదవ తరగతి పూర్వ విద్యార్థులు కలిసి పరామర్శించి, తమ ప్రియ స్నేహితుడి కుటుంబానికి అండగా నిలుస్తూ రూ. 1,11,111 (ఒక లక్ష పదకొండు వేల నూట పదకొండు రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు.... స్నేహం అంటే కేవలం కలిసి చదవడం మాత్రమే కాదని, కష్టకాలంలో తోడుగా నిలవడమే నిజమైన స్నేహమని వారు ఈ సందర్భంగా చాటిచెప్పారు.... భవిష్యత్తులో కూడా శ్రవణ్ కుమార్ రెడ్డి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు....

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో తమ స్నేహితుడు దాసిరెడ్డి శ్రవణ్ కుమార్ రెడ్డి చురుకుగా పాల్గొని ఉద్యమ స్ఫూర్తిని చాటుతూ జైలుకు సైతం వెళ్లారని గుర్తు చేసుకున్నారు.... అలాగే గ్రామ అభివృద్ధి, ప్రజా సేవల కోసం ఐదు సంవత్సరాల పాటు సిరిపురం ఉపసర్పంచిగా నిస్వార్థంగా పనిచేసి గ్రామ ప్రజల మన్ననలు పొందారని తెలిపారు.... అలాంటి వ్యక్తి అకాల మరణంతో కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు....

తెలంగాణ ఉద్యమంలో పాల్గొని, గ్రామానికి విశిష్ట సేవలు అందించిన శ్రవణ్ కుమార్ రెడ్డి వంటి వ్యక్తుల కుటుంబాలను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు... ఆయన భార్యకు అర్హతలకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంతో పాటు, కుటుంబానికి ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.... సమాజం కోసం పనిచేసిన వారి కుటుంబాలు కష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం అండగా నిలవడం ద్వారా సేవాభావానికి గౌరవం దక్కుతుందని పేర్కొన్నారు....

దాసిరెడ్డి శ్రవణ్ కుమార్ రెడ్డి కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, స్నేహితులు, పూర్వ విద్యార్థులు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేశారు.... ఆయన సేవలను గుర్తిస్తూ కుటుంబానికి భరోసా కల్పించడం ద్వారా ప్రభుత్వం తన సామాజిక బాధ్యతను నెరవేర్చాలని కోరారు....

“స్నేహితుడు లేడు... కానీ అతని కుటుంబానికి మేమున్నాం. ప్రభుత్వం కూడా అండగా నిలవాలి” అని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు....

## అంగన్వాడీ ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్వాడీ బాట




**కరీంనగర్ అక్షిత న్యూస్:** కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల పరిధిలో ని వెదురుగట్ట గ్రామం రామలింగం పల్లి లో ని అంగన్వాడీ -3 ఇసిడిస్ సూపర్ వైజర్ శ్రీ లత ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు శనివారం రోజున అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్బంగా ఐసిడిస్ సూపర్ వైజర్ శ్రీలత మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్వాడీ కేంద్ర నికి తీసుకురావాలని అన్నారు.. చిన్నారులకు విద్య నేర్పించడం తో పాటు ఆటవస్తువులు చూపిస్తూ చిన్నారుల మెదస్సు ఉపయోగ పడే గేమ్స్ ఉంటాయాన్నారు.పిల్లలకి పౌష్టి కరమైన ఆహారం ఉంటుందని, ఇంతే కాకుండా అంగన్వాడీ కేంద్రం లో గర్భిణీ స్త్రీలకు మీటమిన్, ప్రొరిండ్ల తో కూడిన ఆహారం అందిస్తామన్నారు. ప్రాధమిక విద్యకు ముందు చిన్నారులకు ఓనమాలతో కూడిన విద్య ఉంటుంది అన్నారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ టీచర్లు గుల్లపల్లి రమ, చిలుక లక్ష్మి నర్సమ్మ వార్డు సభ్యులు సతీష్, సుజాత తో పాటు చిన్నారుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు

## రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

**ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**



**మానకొండూర్ అక్షిత న్యూస్:** గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్టు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. శనివారం బెజ్జంకి మండలం దేవక్కపల్లి, పోతారం, పెరుకబండ గ్రామాల్లో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి మెరుగైన రహదారులు ఎంతో అవసరమన్నారు. ప్రజలకు రాకపోకల సౌకర్యం కల్పించడంతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ముఖ్యంగా గ్రామాల మధ్య కనెక్టివిటీ పెంచడంతో అభివృద్ధికి బాట వేయడమేనని ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమాల్లో దేవక్కపల్లి గ్రామ సర్పంచ్ ముక్కిస రత్నాకర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డితోపాటు పలువురు సర్పంచులు, పార్టీ గ్రామాధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

"పరామర్శలు"

బెజ్జంకి మండలం పాపన్నపల్లి, బెజ్జంకి ఎక్స్ రోడ్డు, గాగిల్లాపూర్ గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతులకు నివాళు లర్పించడమే కాకుండా వారి కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు.

# చినుకు పడిందంటే అంధకారంలోకి జీడిపల్లి

**కొన్ని సంవత్సరాలుగా తీరని విద్యుత్ సమస్య**

**నరకయాతన అనుభవిస్తున్న జీడిపల్లి గ్రామ ప్రజలు**

**విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం**



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంజీడిపల్లి గ్రామంలో విద్యుత్ సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు,సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.జీడిపల్లి గ్రామంలో ప్రజలుప్రజలునిద్ర పోవాలంటే కరెంటు ఎప్పుడు వస్తుందా అని తెల్లారే వరకు వేచి చూడాల్సిందే,గ్రామ ప్రజలు విద్యుత్ సమస్యతో అల్లాడుతున్నారు.గ్రామంలో గర్భిణీ స్త్రీలు,బాలింతలు,చిన్నారులు,వృద్ధులు,అనారోగ్యం పాలైన వారు చెమటలు కక్కుతూ ప్రతిరోజు కంటి నిండా నిద్ర లేక నరకయాతన అనుభవిస్తున్నారు. కరెంటు ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు పోతుందో అర్థం కాని దుస్థితిలో జీడిపల్లి గ్రామ ప్రజలు ఉన్నారు.చిన్న సమస్య కూడా పెద్ద ఇబ్బందిగా మారుతోందని వాపోతున్నారు.రోజుకు పదిసార్లకుపైగా విద్యుత్ సరఫరానిలిచిపోవడం,రాత్రి వేళల్లోగంటలతరబడి కరెంటులేకపోవడం వల్ల ప్రజలుతీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.చిన్నపాటి వర్షం కురిసినా రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచిపోవడం పరిపాటిగా మారిందని గ్రామస్తులు చెబుతున్నారు.గత మూడు రోజులనుండి రాత్రి వేళలో కరెంటు ఎలాంటిగాలివాన రాకుండా పూర్తిగా బంద్ అవుతుందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సమస్యలపై విద్యుత్ శాఖ అధికారులనుసంప్రదిస్తే ప్రకృతి వైపరీత్యాలను సాకుగాచూపుతూ బాధ్యత నుంచి!తప్పించుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించిగ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని,విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.ప్రజలను చీకట్లలో నెట్టేసి అధికారులు మౌనంగా ఉండడం తగదని వారు హెచ్చరిస్తున్నారు.గత కొన్ని సంవత్సరాలుగా ఈ విద్యుత్ సమస్యతో గ్రామస్తులు సతమవుతమవుతున్నకూడా విద్యుత్ శాఖసిబ్బంది తూతూ మంత్రంగాచర్యలు చేపడుతూచేతులు దులుపుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అసలేవర్షాకాలం గ్రామస్తులు గాలి వానలకు విష సర్పాలు సంచరిస్తూ ఉంటాయి.దీంతోవిషసర్పాలతో గ్రామస్తులు ఇబ్బందులకు గురి అయ్యే ప్రమాదం ఉందనిగ్రామప్రజలఆందోళనవ్యక్తం చేస్తున్నారు. ఎండాకాలంలో విద్యుత్ వైర్లదగ్గరసమస్యఉన్నచోట చెట్లు ఉండటంతో వాటిని తొలగించేందుకు గ్రామంలో ఉదయం వేళ కరెంటుకోతలువిధిస్తుండేవారు. ఎండాకాలంలో చెట్లు తొలగించగా పోవడంతో కొన్నిచోట్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయిఅన్న వినికిడి గ్రామంలో వినిపిస్తుంది.జీడిపల్లి గ్రామానికి సంబంధించిన విద్యుత్ అధికారులను విద్యుత్తు లేదు అని గ్రామస్తులు సంప్రదిస్తే ఫీడర్ ట్రిప్ అయింది అని మాటలు చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. అవసరాలు విజయం సిబ్బంది కూడా గ్రామంలో సరిగా విధులు నిర్వహిస్తుండక పోవడం కూడా ఒక కారణమని చెప్పవచ్చని ప్రజలు అంటున్నారు. ఇకనైనా విద్యుత్ అధికారులు విద్యుత్ సిబ్బంది నిద్రమత్తు వీడి జీడిపల్లి గ్రామ కరెంటు సమస్యను వెంటనే తీర్చాలని లేనిచో ఏఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.

# హామీలకు తక్కువా.. ఆర్భాటాలకు ఎక్కువ రేవంత్ రెడ్డి

**హామీలతో రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్**

**పెద్ద జీతగాడు విదేశీ పర్యటన మోజుగా పెట్టుకున్నాడు**

**మాజీ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్**



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** హామీలకు తక్కువా......ఆర్భాటాలకు ఎక్కువ రేవంత్ రెడ్డి అని, హామీలతో రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి రైతులే చెప్తారని అందుకే పెద్ద జీతగాడు విదేశీ పర్యటన మోజుగా పెట్టుకున్నాడని బిఆరెస్ జిల్లా మాజీ అధ్యక్షులు గట్టు యాదవ్ విమర్శించారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలో

మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్వగృహంలో బి.ఆర్.ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశములో గట్టు యాదవ్ మాజీ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మాజీ ఎం.పి.పి కృష్ణ నాయక్ లు మాట్లాడుతూ రైతు ద్రోహిగా రేవంత్ రెడ్డి చరిత్రకు ఎక్కారని రైతు వ్యతిరేఖ విధానాలపై నిప్పులు చెరిగారు. నాలుగు సార్లు రైతు భరోసా ఎగవేత, మొత్తం సన్నాలకు బోనస్ అని చెప్పి విడతల వారిగా కోత విధించారని ఎద్దేవా చేశారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని మండిపడ్డారు. సాగు తాగు నీళ్లకు కె.సి.ఆర్ ప్రత్యేక దృష్టితో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును తీసుకొచ్చాడని తెలిపారు. మిగిలిన కొంత పనులకు కేవలం 1000కోట్లు ఖర్చుపెట్టలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని అన్నారు. హర్రాజు పాటలాగా హామీలు ఇచ్చి గద్దెనెక్కి తెలంగాణ ప్రజలను మోసం చేసిందని అన్నారు. హామీలు ఎగ్గొటిన కాంగ్రెస్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీజన్ ప్రారంభంలో కూడా రైతు భరోసా ఇవ్వలేదని, ధాన్యం కొనుగోలు నెపం కేంద్రం పై నెట్టివేసి రేవంత్ రెడ్డి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు విషయములో ఒక్కనాడైనా ఎం.ఎల్.ఏ సమీక్ష చేశాడా అని ప్రశ్నించారు. యూరియా కష్టాలు శాశ్వతంగా నిలిపిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది అని అన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు గ్రామాలలో తిరిగితే గుడ్డలు ఊడదీస్తారని హెచ్చరించారు. రైతులను రేవంత్ వెన్నుపోటు పొడిచారని, కె.సి.ఆర్ ను మించి సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్న హామీలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అన్నపూర్ణ పేరు గాంచిన రాష్ట్రాన్ని ఆగం చేశాడని, నీళ్లు, నిధులు, నియామకాలు కోసం పదవులు త్యాగం చేసి పోరాటం చేసిన కె.సి.ఆర్. వ్యవసాయాన్ని సస్యశామలం చేసిన ఘనత కె.సి.ఆర్. ది అని అన్నారు. 11విడతలుగా 72లక్షల కోట్లు రైతు బంధు ఇచ్చి దేశాన్నికి కె.సి.ఆర్ ఆదర్శంగా నిలిచాడని చెప్పారు. రైతు భరోసా రైతు బీమా, రైతు రుణ మాఫీ ఎగ్గొట్టి యూరియా కూడా సరఫరా చేయకుండా రైతులకు రేవంత్ రెడ్డి ద్రోహం చేసిండని మండిపడ్డారు. యూరియా సరఫరా లేకున్న రైతు భరోసా లేకున్నా ఆరుగాలం శ్రమించి పంటలు పండించినా ధాన్యం కొనుగోలు చేయడంలో కూడా పూర్తిగా విఫలం అయ్యారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు మీద గోష్ కమిటీ వేసి గొంగడంత కూడా ఆరోపణలు నిరూపించలేకపోయారని ఎద్దేవా చేశారు. కె.సి.ఆర్ 2 కోట్ల 30లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగు అందుబాటులోకి తెచ్చారని గుర్తు చేశారు. 7వేల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి చివరి గింజతో సహా కె.సి.ఆర్ కొనుగోలు చేశారని చెప్పారు. దాచుకో, దోచుకో విధానాన్ని కాంగ్రెస్ నాయకులు అనుసరిస్తూ ప్రజల రక్తాన్ని పీలుస్తున్న జలగలుగా తయారు అయినారని మండిపడ్డారు. కేంద్రంతో పని లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోలెమోని. లక్ష్మయ్య, నందిమల్ల. అశోక్, గంధం.పరంజ్యోతి, మండల పార్టీ అధ్యక్షులు రాళ్ళ.కృష్ణయ్య,కె.మాణిక్యం,రఘువర్ధన్ రెడ్డి,వేణు గోపాల్,గులాం ఖాదర్ ఖాన్,నాగన్న యాదవ్ ,వెంకట్ సాగర్,సూర్యవంశం.గిరి,చిట్యాల.రాము, జోహెబ్ హుస్సేన్, నీలస్వామి, ఎర్ర.శ్రీనివాసులు, బొబ్బిలి.ప్రేమ్ కుమార్,చంద్రశేఖర్,లక్ష్మీకాంత్ రెడ్డి

# మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలిద్దాం

### డ్రగ్స్ రహిత కరీంనగర్ లక్ష్యంగా సమష్టిగా కృషి చేద్దాం

### కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా




**కరీంనగర్ అక్షిత బ్యూరో:** మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నార్కోటిక్ కోఆర్డినేషన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నియంత్రణ సమాజంలోని ప్రతి ఒక్కరి సమిష్టి బాధ్యత అని పేర్కొన్నారు. యువతను మత్తు బారిన పడకుండా కాపాడేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డ్రగ్స్ రహిత జిల్లాగా కరీంనగర్‌ను తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కల్పించడం ద్వారా యువతను సరైన మార్గంలో



నడిపించవచ్చని పేర్కొన్న ఆమె, మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని సూచించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ, ఈ నెల 26న నిర్వహించే అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యాసంస్థల్లో విద్యార్థులకు, ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలకు, గ్రామ సభల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేక దాడులు నిర్వహిస్తున్నామని, అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి విద్యార్థులతో పోస్టర్ డ్రాయింగ్ పోటీలు నిర్వహించడం, విద్యాసంస్థలను సందర్శించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 26న ర్యాలీలు, గ్రామ సభలు, డ్రగ్ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు వివరించారు. విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో పాన్ షాపులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ "డీసీపీఓ" పర్వీన్ మాట్లాడుతూ, "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుంచి చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. అనంతరం "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో ఆర్డీవోలు షర్మిల, జల కుమారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు నార్కోటిక్స్ ఇన్స్పెక్టర్ రఫిక్ ఖాన్ పోలీస్, ఎక్సైజ్, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రక్షాళనలో పార్టీ శ్రేణులు చురుగ్గా పాల్గొనాలి

### మాజీ ఎమ్మెల్యే గండ్ర, రాకేష్ రెడ్డి

**అక్షిత బ్యూరో జయశంకర్ భూపాలపల్లి :** దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యున్నత ఆయుధం ఓటు హక్కు అని, మన భవిష్యత్తును, దేశ పాలనను నిర్దేశించే నాయకులను ఎన్నుకునే స్వేచ్ఛను అది కల్పిస్తుందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి అన్నారు. శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఓటర్ సవరణ ప్రక్రియపై నియోజకవర్గ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత





ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా "సర్" కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఓటరు జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయడమే ధ్యేయంగా ఈ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోందని, ఇందులో భాగంగా బూత్ స్థాయి అధికారులు నేరుగా ఓటర్ల ఇళ్లకు వచ్చి క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతున్నారని వివరించారు.

అర్హులైన కొత్త ఓటర్లను జాబితాలో చేర్చడం, మరణించిన వారి లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను తొలగించడం, అలాగే ఓటరు కార్డులలోని తప్పులను సవరించడం ఈ ఇంటింటి సర్వే యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ సమయంలో ఓటర్లు తమ పేరును ధృవీకరించుకోవడానికి లేదా సవరణల కోసం అధికారులకు ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, చిరునామా ఆధారాలను చూపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఇది ఎంతో ముఖ్యమైన కార్యక్రమం కాబట్టి, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రతి బూత్ నుండి పార్టీ తరఫున ఒక ప్రతినిధిని (బూత్ లెవల్ ఏజెంట్) నియమించడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, బూత్ లెవల్ ఏజెంట్లు ఈ ప్రక్రియలో చురుగ్గా భాగస్వాములు కావాలని, అనర్హులైన ఓటర్లను తొలగిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం రాబోయే రోజుల్లో పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహాత్మక అడుగులు, పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదుపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

# నాడు దేశ సేవలో నేడు ప్రజా సేవలో అలుపెరగని అపర భగీరధుడు ఉత్తం

### అభివృద్దే ఆయన ఆశయం.. జనం మాటే ఆయన బాట...

### మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు



**కోదాడ అక్షిత ప్రతినిధి:** రెండు నియోజక వర్గాల ప్రగతి భాగ్య విధాత ఉత్తమ్ అని కోదాడ మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు అన్నారు. శని వారం ఎర్నేని నివాసం వద్ద మంత్రి ఉత్తమ్ జన్మదిన వేడుకలు వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానుల మధ్య నిర్వహించి మాట్లాడారు. నాడు దేశ సేవ లో ఖ్యాతి గాంచిన సైనికుడు ఉత్తమ్ నేడు ప్రజా సేవ కోసం రాజకీయాల్లోకి వచ్చి జీవితాన్ని ప్రజల కు త్యాగం చేస్తున్నారన్నారు. మంత్రి వర్గం లో కీలక శాఖలు చేపట్టి రాష్ట్రం లో అభివృద్ధి నీ పరుగులు పెట్టిస్తు ప్రభుత్వం లో కీలకంగా మారిన అగ్ర నేత ఉత్తమ్ అన్నారు. భారీ నీటి పారుదల శాఖ మంత్రి గా రైతుల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సాగు నీరు ఇబ్బందులు కలుగకుండా ప్రాజెక్టుల అభివృద్ధికి కృషి చేస్తున్న అపర భగీరదుడు ఉత్తమ్ అన్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి గా రాష్ట్రం లో ఏ ప్రభుత్వం చేపట్టని పథకం సన్న బియ్యం పథకం అమలు చేస్తూ పేదల ఆకలి తీరుస్తున్న అన్న దాత ఉత్తమ్ అన్నారు. కోదాడ హుజూర్ నగర్ నియోజక వర్గాలు రెండు కళ్ల లా భావిస్తూ రెండు నియోజక వర్గాల్లో రోడ్లు, విద్యా, వైద్య, విద్యుత్,సాగు నీరు, తాగు నీరు, విద్యుత్ సదుపాయాల కోసం వేల కోట్ల రూపాయలు మంజూరు చేయించిన అభివృద్ధి ప్రదాత అన్నారు. ప్రజలే కుటుంబంగా భావించి దంపతులు ఇద్దరు రాజకీయాల్లో రాణిస్తూ ప్రజల గుండె ల్లో నిలిచారని కొనియాడారు. కోదాడ, హుజూర్ నగర్ నియోజక వర్గాల్లోనే కాదు సూర్య చంద్రులు ఉన్నంత వరకు మంత్రి ఉత్తమ్ ఎమ్మెల్యే పద్మావతి ల పేరు రాష్ట్ర మొత్తం ఉంటుందన్నారు. వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానుల మధ్య భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ భారీగా నినాదాలు చేశారు. పట్టణం లో భారీ కట్ అవుట్ లు కట్టి ఉత్తమ్ జన్మ దినం పండుగ లా చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలోనాయకులు అల్తాఫ్ హుస్సేన్ ,బండల్ కోటిరెడ్డి ,పాశం శీను ,తోట జ్యోతి ,నాగేంద్రమ్మ ,నేహా నాజ్ , ఉప్పుగండ్ల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ ఫయాజ్, కాంగ్రెస్ నాయకులు రావెళ్ళ కృష్ణారావు ,మైలార్శెట్టి భాస్కర్, ఒంటి పులి శ్రీనివాస్, లైటింగ్ ప్రసాద్ ,కాజా, వేమూరి సతీష్, చందు నాగేశ్వరరావు, నెమ్మది దేవమని ప్రకాష్ బాబు, మాతంగి శైలజ, కెజ్జమ్మ ఉన్నారు

# బాధితుని పరామర్శించిన బిఆరెస్ నాయకులు



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** వనపర్తి జిల్లా మాజీ గ్రంథాలయం సంస్థ చైర్మన్, బిఆరెస్ సీనియర్ నాయకులు బి లక్ష్మయ్య సోదరుడు బి. రాములు ఇటీవల ప్రమాదంలో గాయపడి మోకాళ్ళ ఆపరేషన్ జరిగింది. విషయం తెలుసుకున్న వనపర్తి జిల్లా బిఆరెస్ నాయకులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాములు ను పరామర్శించారు. అనంతరం ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వీరితోపాటు వనపర్తి పట్టణ బి ఆర్ఎస్ పార్టీ నాయకులు బి లక్ష్మయ్య , గంధం పరంజ్యోతి, గులాం ఖాదర్ ఖాన్ , నీల స్వామి, సూగూరు వెంకటేష్ సాగర్, వేణుగోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# బాప్టిస్ట్ చర్చిలో మంత్రి ఉత్తం జన్మదిన వేడుకలు

## చర్చిలో పాస్టర్ యేసయ్య ప్రత్యేక ప్రార్ధనలు



కోదాడ అక్షిత ప్రతినిధి: మున్సిపల్ క్రిస్టియన్ కోఆప్షన్ మాజీ సభ్యురాలు ఒంటిపాక జానకి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం నయా నగర్ బాప్టిస్ట్ చర్చిలో క్రైస్తవుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు అనంతరం పాస్టర్ యేసయ్య మాట్లాడుతు వేలకోట్ల రూపాయలు నిధులు తీసుకువచ్చి కోదాడ,హుజూర్నగర్ రెండు యోజకవర్గాల్లో అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్న తమ అభిమాన నాయకుడని కొనియాడారు తను యవ్వన దశలో దేశ సేవలో సైనికుడిగా నేడు ప్రజాసేవలో అలుపెరగని మహా నాయకుడుగా ప్రజల గుండెలలో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోని నిండు నూరేళ్ల రాజకీయ జీవితంలో గడపాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నతమైన పదవులు అందుకొని ప్రజలకు మరింతకాలం వారు సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాప్టిస్ట్ చర్చ్ పాస్టర్ యేసయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోదాడ మున్సిపల్ మాజీ క్రిస్టియన్ మైనారిటీ కోఆప్షన్ సభ్యురాలు వంటిపాక జానకి యేసయ్య సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాంపాటి పుల్లయ్య గుండెపంగు రమేష్ ఎస్సీ సెల్ అధ్యక్షులు రాంబాబు పాస్టర్లు రాజేష్ ప్రభుదాస్ సుధారాణి సైమన్ దీప్తి తదితరులు పాల్గొన్నారు

# జూన్ 6న పద్మశాలి ఉద్యోగుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి



మహబూబ్ నగర్,( అక్షిత న్యూస్): ఈనెల 26న హైదరాబాద్ లోని ఎల్బీనగర్, సకుల శాలి సమాజ భవనం నందు తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఉద్యోగుల సదస్సు నిర్వహించడం జరుగుతుందని మహబూబ్ నగర్ ఉమ్మడి అధ్యక్షులు కెంచె సుభాష్ చంద్ర కార్యదర్శి బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు, రాష్ట్ర సదస్సులో సంఘ కార్యక్రమాలు బలోపేతం, సమస్యలు పరిష్కారానికి అవసరమైన చర్యలు తదితర అంశాలపై చర్చ ఉంటుందని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని పద్మశాలి ఉద్యోగులు సకాలంలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

# పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడుకి ఘన సన్మానం



వనపర్తి అక్షిత ప్రతినిధి : ఇటీవల నూతనంగా కొత్తకోట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన దేశి పెంటన్న యాదవ్ ను జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఎన్ జె బోయెజ్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువ తో ఘనంగా సన్మానించి, స్వీట్స్ తినిపించి ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మురలి, ఎస్సి సెల్ అధ్యక్షుడు జెకే రాజు, మైనార్టీ నాయకులు సలీం, ముజీబ్, డోల్ మన్యం, రామ్ లాల్, సత్యన్న, కర్ణ కుమార్, సహదేవ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలి

## జిల్లా కలెక్టర్ హరిత



ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో: జిల్లాలో ఈ నెల 25వ తేదీ నుండి జూలై 24వ తేదీ వరకు నిర్వహించనున్న 'ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ' కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలిసేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. శనివారం ఉదయం కలెక్టరేట్ భవన సముదాయం నుండి వివేకానంద చౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా నిర్వహించిన "2ఖ రన్" ను అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ గారితో కలిసి ఆమె జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని మొత్తం 678 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఈ ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియ అత్యంత



పారదర్శకంగా మరియు విజయవంతంగా సాగాలని అధికారులను ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) తప్పనిసరిగా ప్రతి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయడంతో పాటు మార్పులు చేర్పులను సక్రమంగా చేపట్టాలని సూచించారు. బిఎల్ఓ యాప్ ద్వారా ఈ వివరాల నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.

ఈ ఓటరు సవరణ ప్రక్రియను ఒక బాధ్యతాయుతమైన కార్యక్రమంగా భావించి, దీని విజయవంతానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామ పెద్దలు, యువజన సంఘాలు మరియు విద్యార్థులు పూర్తి స్థాయిలో సహకరిస్తూ భాగస్వాములు కావాలని కోరారు. ఓటరు నమోదుపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మీడియా పాత్ర ఎంతో కీలకమని, పత్రికలు మరియు ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ఈ సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు

ఈ అవగాహన 2ఖ రన్ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, యువజన సంఘాల ప్రతినిధులు మరియు కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

జూన్ 25 నుండి జూలై 24 వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న 678 పోలింగ్ కేంద్రాల్లో

బీఎల ల ద్వారా ఇంటింటి సర్వే మరియు 'బిఎల్ఓ యాప్' ద్వారా వివరాల నమోదు చేయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు ఉద్యోగ , ఉపాధి అవకాశాలు కల్పించడమే తన ప్రథమ లక్ష్యం

## టాస్క్ సి ఓ ఓ,ఐకృత పౌండేషన్ చైర్మన్ ,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



కల్వకుర్తి అక్షిత ప్రతినిధి: తుక్కుగూడ లోని ప్రముఖ అంతర్జాతీయ ఎలక్ట్రానిక్ కంపెనీలో గత రెండు వారాల క్రితం ఇంటర్వ్యూ కు హాజరైన వారిలో ఉద్యోగాలు సాధించిన నియోజకవర్గంలోని వివిధ మండలాల 9 మంది నిరుద్యోగ యువత జాయినింగ్ కార్యక్రమంలోహముఖ్య అతిథిగా పాల్గొన్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి వారిని అభినందించారు.ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ యువత కష్టపడి చదివి, నైపుణ్యాలను పెంపొందించుకొని ప్రతిష్టాత్మక సంస్థల్లో, కంపెనీలల్లో ఉద్యోగాలు పొందడం ఎంతో సంతోషకరమని అన్నారు. ఉద్యోగం సాధించిన యువత ఇతర నిరుద్యోగులకు ఆదర్శంగా నిలవాలని, తమ వృత్తిలో రాణిస్తూ ఆర్థికంగా బలోపేతం అవుతూ ,ఉజ్వలమైన భవిష్యత్ నిర్మాణం కోసం అడుగులు వేయాలని ఆకాంక్షించారు. అలాగే యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న జాబ్ డ్రైవ్లు, ఉచిత శిక్షణా కేంద్రాలు,నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అవగాహన కార్యక్రమాలు మరింత మంది యువతకు ఉపయోగపడాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా నిరుద్యోగ యువతకు ఉద్యోగ , ఉపాధి అవకాశాల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాల కోసం కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని అర్హత ఉన్న నిరుద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ సందర్భంగా నిరుద్యోగ యువత మాట్లాడుతూ మా భవిష్యత్ గురించి ఆలోచిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ మాకు తోడ్పాటునందిస్తున్నందుకు ఇంత మంచి అవకాశం కల్పించినందుకు ఎల్లవేళలా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి రుణపడి ఉంటామని తెలుపుతూ కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ఐకృత పౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్, నిరుద్యోగ యువత తదితరులు పాల్గొన్నారు

# శ్రీ వాణి హై స్కూల్ లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు

## రోగరహిత జీవితం ..యోగ వల్లనే సాధ్యం ..పాఠశాల ప్రిన్సిపల్



వనపర్తి అక్షిత ప్రతినిధి: నేడు వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని శ్రీ వాణి హై స్కూల్ లో ఆదివారం జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంను పాఠశాల విద్యార్థులకు అవగాహన కలిగించడానికి ముందు రోజే శనివారం రోజు యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అడ్వైజర్ టి.జే.విశ్వేశ్వర్,ప్రిన్సిపల్ లత మరియు గంగాధర్ , వైస్ ప్రిన్సిపల్ అంజ్ లీ,ఉపాధ్యాయులు శాంత,రాధ,చైతన్య,సంధ్య,రుచి మరియు తెలుగు తిరుమలేష్,వెంకటేష్ గౌడ్, నసీమ్ బేగ్,రాజశేఖర్, శుభాశీష్,వ్యాయామ ఉపాధ్యాయులు నరేందర్ తదితర ఉపాధ్యాయులు మరియు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు యోగా గురించి అవగాహన కలిగిస్తూ యోగాసనాలు,ప్రాణయామ,ధ్యానం,సూర్య నమస్కారంలను కొన్నింటిని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులతోనూ చేయించి వారిని అనుసరిస్తూ విద్యార్థులు కూడా యోగాసనాలు చక్కగా చేశారనీ,ఈ సందర్భంగా యోగా వల్ల కలిగే ప్రయోజనాలను గురించి విద్యార్థులకు తెలియజేశారు.

2015 జూన్ 21 న, మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకున్నారు. ఇప్పుడు 2026థీమ్ "ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా" అనే థీమ్‌ను భారతదేశ ఆయుష్ మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రధాన కార్యక్రమం 2026 జూన్ 21న పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో జరగనుంది అని వారు తెలియజేశారు.

యోగాసనాలు,ప్రాణయామ,ధ్యానం,సూర్య నమస్కారం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి అంటే రోజు యోగా చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా అనేక అద్భుతమైన ప్రయోజనాలు ఉన్నాయి.రక్తపోటు అదుపులో ఉంటుంది, గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది మరియు రోగనిరోధక శక్తి బలపడుతుంది.ఆసనాలు, ప్రాణాయామంతో అలరించిన చిన్నారులు ప్రతీ ఒక్కరూ యోగాను దినచర్యగా మార్చుకోవాలని విద్యార్థులకు తెలియజేస్తూ, అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.